క్లుప్తంగా

రోడ్డు పనులకు ఎమ్మెల్సీ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు, ఎంపీపీ పద్మ

కవిటి: కొత్తపుట్టుగలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ నర్తు రామారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్, నర్తు శివాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర, రాజాం, పల్లిసారధి పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. పల్లిసారధి రైతు భరోసా కేంద్రం నుంచి గరుడబద్ర–బొడ్డపాడు గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్డు కూడలి వరకు రూ. 90 లక్షలతో పాటు గరుడబద్ర నుండి మీలగారంపాడు వరకు రూ.1.50 కోట్లు వ్యయంతో జరగనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు గూడ గిరిజ, పిట్ట గీత, బత్తిని కుసుమ, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక

టెక్కలి: హైదరాబాద్ కేంద్రంగా ఉన్నటువంటి యంత్ర ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ కంపెనీలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సీఎస్ఈ, ఐటీలకు చెందిన బరాటం జాహ్నవి, పాయిల చరణ్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరికి వార్షిక వేతనంగా ఒక్కొక్కరికీ ఆరు నుంచి ఎనిమిది లక్షల రూపాయలు అందజేస్తారని చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, వై.రమేష్, బి.రమేష్ అభినందించారు.

500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

మందస: కారిగాంలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబి ఆధ్వర్యంలో దాడులు చేసి 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ పోలీసు డివిజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖా ముఖిగా మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

ముగిసిన అతిరుద్ర యాగం

కవిటి: చిన్నకర్రివానిపాలెంలో కాశీవిశ్వనాధ స్వామి ఆలయం సింహద్వార ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా చివరిరోజు ఒడిశాకు చెందిన వేదపండితుల సమక్షంలో గ్రామస్థులచే లోకకల్యాణార్థం అతిరుద్రయాగం వైభవంగా నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో శివదేవి ప్రతిభ

కవిటి: మైసూరు దత్తపీఠం వారు వర్చువల్ విధానంలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో కొత్తూరుకు చెందిన గృహిణి పినింటి శివవేది మెమోరీ కాంటెస్ట్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఏప్రిల్ 27, 28 తేదీల్లో భగవద్గీతలోని 18 అధ్యాయాల నుంచి 712 శ్లోకాల్లో అరగంట పాటు మధ్యమధ్యలో శ్లోకాల ప్రారంభం తెలిపి దాన్ని పూర్తిచేస్తూ వల్లెవేసే విధానంలో ప్రతిభ కనబర్చి పతకాన్ని గెలుచుకుంది.

- టెక్కలి జిల్లా ఆస్పత్రిలో దారుణం
- అందుబాటులో ఉండని జీడీఏలు..

సహాయకులు కానరారు!



తల్లిని పైవార్డుకి తీసుకెళ్లేందుకు సహాయం చేసేవారు లేక కూతురే స్ట్రెచర్‌పై తోసుకొని వెళ్తున్న దృశ్యం

టెక్కలి రూరల్:

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలిలోని జిల్లా ఆస్పత్రిలో రోగులకు సహాయం చేసేవారే లేకుండా పోయారు. దీంతో రోగులు ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వివిధ పరీక్షల కోసం తీసుకెళ్లే సమయంలో జనరల్ డ్యూటీ అటెండర్లు (జీడీఏలు) అందుబాటులో ఉండకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం టెక్కలి జిల్లా ఆస్పత్రిలో రోగులకు సహాయం చేసేందుకు 18 మంది జీడీఏలను నియమించింది. వారు ఆస్పత్రికి వచ్చే రోగులను కావాల్సిన వార్డులకు తీసుకెళ్లడంతో పాటు వారిని వీల్‌చైర్‌పై ఉంచి వైద్యులు సూచించిన విధంగా వారిని వివిధ పరీక్షల ల్యాబ్‌లకు తీసుకెళ్లేందుకు సహాయపడేవారు. అయితే ప్రస్తుతం వారు తమ పనులు చేయకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారికి అప్పగించిన పనులు తప్పా..మిగిలిన పనులు చేస్తున్నారు. కొందరు డాక్టర్లకు హెల్పర్లుగా, మరికొందరు టీలు తేవడానికి, దోబీగా సేవలు అందిస్తున్నారు తప్పితే.. రోగుల సేవలో మాత్రం ఉండడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఎవరైనా గాయాలతో వచ్చేవారు, వృద్ధులు వైద్యుల వద్దకు వెళ్లేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో సహాయకులుగా వచ్చినవారే రోగిని వీల్‌చైర్‌పై వైద్యులు, ల్యాబ్‌ల వద్దకు తోసుకొని తీసుకెళ్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కాగా 18 మంది జీడీఏల్లో ఇద్దరిని ఇటీవల వేరే ప్రాంతాలకు అధికారులు బదిలీ చేశారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి రోగుల సేవలో జీడీఏలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాలుకి గాయమైన భర్తను వీల్‌చైర్‌పై వైద్యుడు వద్దకు తీసుకెళ్తున్న భార్య



అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న వృద్ధుడు

పైప్‌లైన్ పనులు పూర్తిచేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో నెలకున్న నీటి సమస్యను అధిగమించడానికి వాటర్ హెడ్‌వర్క్స్‌ని ఉద్దానం వాటర్ ప్రాజెక్టుకి అనుసంధానం చేసే పైప్‌లైన్ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు ప్రతి నిత్యం నీటిని అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సంబంధిత కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి సూచించారు. ఉద్దానం వాటర్ ప్రాజెక్టును మున్సిపల్ పంప్‌హౌస్‌కి అనుసంధానం చేసేందుకు అవసరమైన పైప్‌లైన్ పనులను పట్టణంలో భువనేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఈ పనుల్లో ఎక్కడా జాప్యం జరుగకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి సిబ్బందికి సూచించారు. పనులను శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై కిశోర బాలికలకు అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: హక్కులపై 15 నుంచి 19 ఏళ్లలోపు కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పొందూరు పుష్పలత అన్నారు. వేసవి కాలం ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బిర్లంగి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంపై బాలికలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, వీఓఏ, మహిళా పోలీస్, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కిశోర బాలికలతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.సుజాత, ఎస్.పీలవేణి, జె.లక్ష్మి, పి.పల్లవి, జి.కృష్ణవేణి తదితరులు, పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



కళాకారులను సన్మానిస్తున్న సర్పంచ్, సైనింగ్ స్టార్ యువజన సంఘ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: సాంకేతిక యుగంలో కనుమరుగవుతున్న ప్రాచీన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. గరుడబద్రలో ఉన్న సైనింగ్ స్టార్ యువజన సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులు ఆట, పాటలు, నటనతో అలరించారు. అమ్మరామక్రిష్ణ వేసిన ఏకాభినయపాత్ర అలోచింపజేసింది. కాగా కళాకారులు డాక్టర్ కుమార్‌నాయక్,అమ్మరామక్రిష్ణ,రాపాక ధనరాజు, ఆర్.గణేష్,దాసరి తాతారావు,రేలారే రేలారే జానకిరాం,నక్క వాసులకు సైనింగ్ స్టార్ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వై.సంతోష్‌కుమార్, గూడ ఈశ్వరరావు, చెల్లూరి పాపారావు, వై.ధర్మారావు, వై.అప్పారావు, ధనరాజ్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు

మందస: ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు అన్నారు. అందుకు ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలే నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ శుక్రవారం కొత్తపల్లి, అనంతపురం, ముకుందపుకం గ్రామాల్లో స్థానిక పెద్దలు, పీఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పర్యటించి ప్రచారం చేశారు. తల్లిదండ్రులను కలిసి పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్, క్విజ్ పోటీలు, ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ మొదలైన వాటికి ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. కె.తిరుపతి, ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎస్.కిరణ్‌కుమార్, చిత్రసేను, బి.రమేష్ పాల్గొన్నారు.

సర్కార్ నిర్లక్ష్యంతోనే భక్తులు మృతి



మాట్లాడుతున్న దుర్యోధనరావు

కాశీబుగ్గ: కూటమి సర్కార్ నిర్లక్ష్యం కారణంగానే సింహాచలం పుణ్యక్షేత్రంలో గోడ కూలి ఏడుగురు భక్తులు దుర్మరణం చెందారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఆరోపించారు. పలాసలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..సింహాచలంలో నిర్వహించే చందనోత్సవానికి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారని తెలిసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. గోడ నిర్మాణంలో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ప్రమాదం సంభవించిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్నారు. అప్పన్నస్వామి చందనోత్సవాన్ని తిలకించేందుకు వెళ్లిన భక్తులు భద్రత లోపం వల్ల గోడకూలి అకాల మృత్యువాత పడటం దురదృష్టకరమన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం



సూదికొండ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బమ్మిడి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పెంటిబద్ర మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఫైనల్‌లో సూదికొండ, మొగిలిపాడు జట్లు తలపడగా సూదికొండ విజయం సాధించింది. ఫైనల్లో విజయకేతనం ఎగురవేసిన సూదికొండ జట్టుకు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతులమీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపీ పాల్గొన్నారు.

దేవాలయానికి రోడ్డు



రహదారి నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: సోంపేట పట్టణంలోని సోమపోలమాంబ దేవాలయం నుంచి సత్యన్నారాయణస్వామి దేవాలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ శుక్రవారం భూమి పూజ చేశారు. దేవాలయాలు ప్రశాంత నిలయాలని, దేవలాయాల అభివృద్ధికి సహకరించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీపీ అన్నారు. గ్రామస్తులు నగిరి శరత్, మల్లా వెంకటరమణ, బైరిస్వామి, కొంచాడ రాంజీ, మల్లా బాబురావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పారిశుధ్య కార్మికుడికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: తులసిగాం గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణ భడిత్యా కలేయం వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక సాయం చేయాలంటూ కోరాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన 'తులసిగాం యువ ఫౌండేషన్'సభ్యులు స్పందించి రూ.32,500 నగదును వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం అందజేశారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి: చిన్నారుల్లో వచ్చే కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని నారాయణ ఐ కేర్ ఆస్పత్రి వైద్యుడు ఎం.సుధీర్‌కుమార్ సూచించారు. పట్టణానికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఆఫ్తాల్మిక్ అధికారి ప్రసాదరావు, సిబ్బంది లహరి, కుసుమ, కళా సమితి సభ్యులు చిలుకు కృష్ణారావు,డి.ఎ.స్టాలిన్, యు.గణపతిరావు, రమణమూర్తి, భాస్కరరావు, ప్రధాన హరిశ్చంద్రరావు పాల్గొన్నారు.

పైడిగాం ప్రాజెక్టును పునరుద్ధరించాలి

సోంపేట: పైడిగాం ప్రాజెక్టును పునరుద్ధరించి ఖరీఫ్‌లో సక్రమంగా సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మానవహక్కుల వేదిక, బీసీ సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం పైడిగాం ప్రాజెక్టును పరిశీలించారు. మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు మాట్లాడుతూ.. చిన్న ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. మూడు మండలాల పరిధిలో పది వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టును పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. బీసీసంఘ రాష్ట్ర కార్యదర్శి డిల్లీరావు,ప్రతినిధులు పల్లి హారిశ్చంద్ర తదితరులు ఉన్నారు.

13 లీటర్ల సారా పట్టివేత

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిపిన దాడుల్లో 13 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. బాసుదేవ్ మహంతి అనే వ్యక్తి వద్ద నుంచి మూడు లీటర్లు, శ్యామలపుట్టుగ గ్రామం వద్ద బంజు శ్యామలరావు నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చింతామణి ట్రస్టు సేవలు అమూల్యం

కవిటి: ఉద్దానం ప్రాంత పిల్లల విద్యాభివృద్ధి కోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న చింతామణి ట్రస్టు సేవలు అమూల్యమైనవని కవిటి చింతామణి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం చింతామణి అమ్మవారిని ట్రస్టు వ్యవస్థాపక సభ్యులు ఇందిరాదేవి, చింతామణికుమార్, స్నిగ్ధలు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతానికి చెందిన పలువురు పేద విద్యార్థులకు ట్రస్టు తరపున రూ.3.80 లక్షలను అందించారు. కమిటీ సభ్యులు పూడి లక్ష్మణరావు, బి.వెంకటేశ్వరరావు, పాండవ శేఖర్, ఆరంగి మధు ఉన్నారు.

జూన్ 12లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు జూన్ 12వ తేదీలోగా పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ డీఈఈ వి.సత్యాజి అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన సచివాలయల వార్డు అమెటీస్‌తో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

'దాచూరి' సేవలు చిరస్మరణీయం



కంచిలి: కామ్రేడ్ దాచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ ప్రతినిధులు

కంచిలి: ఉపాధ్యాయ హక్కుల సాధనలో యూటీఎఫ్ నిర్మాత, ఎస్‌టీఎఫ్ఐ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దాచూరి రామిరెడ్డి సేవలు చిరస్మరణీయమని మండల యూటీఎఫ్ ప్రతినిధులు కొనియాడారు. దాచూరి తొమ్మిదో వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు మురళీనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రతినిధులు జర్జాన భగవతిరావు, పైల పురుషోత్తంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవికుమార్, గౌరవ అధ్యక్షుడు త్రిలోచన ప్రధాన్ పాల్గొన్నారు.

నందిగాం: దాచూరి రామిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నందిగాం యూటీఎఫ్ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి త్యాగాలను గుర్తు చేశారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, మండల ప్రధాన కార్యదర్శి వై.గణపతిరావు, కార్యదర్శి బి.చిన్నవాడు పాల్గొన్నారు.

టెక్కలి: యూటీఎఫ్ నేత దాచూరి రామిరెడ్డి ఆశయాలను కొనసాగించాలని ఆ సంఘ జిల్లా నాయకులు కె.దాలయ్య కోరారు. దాచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు టి.వైకుంఠరావు, కుమారస్వామి, డి.పాపారావు, బి.నారాయణరావు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

కాశీబుగ్గ:

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నెలకున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపీ, పలాస నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు కమిషనర్ నడిపే రామారావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్ల పక్కన చెత్త, దోమలు, వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయని.. దీంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. పార్టీ నాయకులు బగాది సింహాచలం, నెయ్యల శివ, తలగాన కిశోర్, రాజేష్ ఉన్నారు.

సారా విక్రయాలు జరగకుండా చూడాలి

సోంపేట: అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్న గ్రామాల్లో సారా విక్రయాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు ఉందని ఎక్సైజ్ సీఐ కె.బేబి అరు. ఉత్సవాలు జరుగుతున్న కొర్లాం, కర్తలిపాలెం, బేసి రామచంద్రాపురం, బట్టిగళ్లూరు, పాలవలస గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలతో సోంపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఎక్సైజ్ నేరాలు గ్రామాల్లో లేకుండా చూడాలని కోరారు. సారా విక్రయాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉత్సవాలు సంతోషకరంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు బుద్దాన శ్రీకృష్ణ, రాంబుడ్డి గణపతి, బట్టి మాధవరావు, పైడి పట్టాభి, పొందూరు గున్నయ్య పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న మునగ!



ఆశాజనకంగా మునగ పంట



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న మునగకాడలు

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్దాన ప్రాంత ప్రజల జీవనాధారమైన ఉద్యాన పంటలలో ఒకటైన మునగ కాయలు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి.సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవున లభించే మునగలో మంచి ఔషధ గుణాలు ఉండటంతో భోజన ప్రియులు ఆహారంలో ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో మునగకాడలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఉద్దాన ప్రాంతమైన ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో అంతర పంటగా మునగను సుమారు 12 వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో వజ్రపుకొత్తూరు మండలంలో అధిక శాతం సాగు చేస్తున్నారు. మెట్టు, పల్లపు ప్రాంతప్రజలు ఇంటి పేరట్లో సైతం సాగు చేసి మంచి ఆదాయాన్ని అర్జిస్తున్నారు.

అంతర పంటగా..

ఉద్యాన పంటలైన కొబ్బరి, జీడితోటల్లో అంతర పంటగా సాగవుతున్న మునగ పంట రైతు ఇంట సిరులు కురిస్తుంది. దీనికి తక్కువ పెట్టుబడి అవుతుంది. ఎలాంటి పురుగు మందులు వినియోగించకుండా తక్కువ నీటి వినియోగంతో పంట సాగవుతోంది. ప్రతి మూడు నెలలకు పంట చేతికి వస్తుండడంతో రైతులు మునగసాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో మునగకాడలు సుమారు 50 రూపాయలు ఉండగా.. రైతుల వద్ద మాత్రం వ్యాపారులు 20 నుంచి 30 రూపాయల మధ్యలో కొనుగోలు చేస్తున్నారు. కాగా ఉద్దానంలో సాగవుతున్న మునగకాడలను కొంతమంది జిల్లా కేంద్రం శ్రీకాకుళంతో పాటు విశాఖ, విజయనగరం, ఒడిశా, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

మహిళకు సత్కారం..



శ్రీకాకుళం జిల్లా కళింగ వైశ్య మహిళా సంఘం అధ్యక్షులురాలు, పలాసకు చెందిన మల్లా పద్మజకు అరుదైన గౌరవం దక్కింది. సుమారు వెయ్యి మంది మహిళలతో శ్రీకాకుళం, విశాఖ, హైదరాబాద్‌లలో కోలాటం ప్రదర్శనలు ఇచ్చినందుకు ఆమెకు తెలుగు వెలుగు సాహితీ వేదిక గుర్తించింది. ఇందులో భాగంగా విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. –కాశీబుగ్గ

నడిరోడ్డుపైనే చెత్త డంపింగ్..



టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి సుదర్శన్ థియేటర్ ఎదురుగా నడిరోడ్డు పైనే చెత్త నిల్వలతో డంపింగ్ చేసేశారు. జనాలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో చెత్తను పడేయడంతో దుర్గంధంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చెత్త నిల్వలు తొలగించకపోవడంపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి జన సంచారం లేని చోట చెత్తను డంపింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. –టెక్కలి

వైభవంగా జలయాత్ర..



ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం గ్రామంలో రాధాకృష్ణ నూతన మందిరం, విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామస్తులు వైభవంగా జలయాత్రను శుక్రవారం చేపట్టారు. ఇచ్ఛాపురం బహుదానదిలో మంత్రోచ్ఛరణలతో గంగమ్మకు పూజలు చేసి, అక్కడ నుంచి కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని రాధాకృష్ణుల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. మూడు రోజుల పాటు గ్రామంలో గీతా యజ్ఞం జరుగుతోందని నిర్వహకులు తెలిపారు. –ఇచ్ఛాపురం రూరల్